క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన


శానిటేషన్ కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బొమ్మల సత్రం, క్రాంతినగర్, నీలివీధి, తెలుగుపేట, మూలసాగరం తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు కాల్వలను శుభ్రం చేయాలని, శానిటేషన్ పనుల్లో అలసత్వం వహించరాదని సూచించారు. ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవన్నారు. ఏఈలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆరుద్ర నక్షత్ర వేడుకలు


నాగలింగేశ్వరుడికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): శివుడి జన్మనక్షత్రమైన ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకొని పట్టణంలో నాగలింగేశ్వర ఆలయంలో చంద్రశేఖర కాళికాంబ దేవస్థానం నాగనంది, బ్రహ్మనందీశ్వర ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. నాగలింగేశ్వర ఆలయంలో వేదపండితుడు విశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి తెల్లవారుజామున పంచామృతాభిషేకాలు నిర్వహించి అన్నాభిషేకం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మహాశివరాత్రి, మాసశివరాత్రిలో చేసే అభిషేకాల కన్నా ఆరుద్ర నక్షత్రం, మార్గశిర నక్షత్రం సోమవారం చేసే పూజలతో ఎంతో పుణ్యం లభిస్తుందన్నారు.

డ్రైవర్ల సంక్షేమానికి కృషి


నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంక్షేమానికి కృషి చేస్తానని ఆల్ ఇండియా ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కార్పొరేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. ఇటీవల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగేశ్వరరావును నంద్యాల జిల్లా డీఐపీఆర్‌ఓ కార్యాలయంలో ప్రభుత్వ వాహన డ్రైవర్ల ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్‌ఖాదర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి పోల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శీను, సభ్యులు పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళి


విజయ్ దివస్ ర్యాలీలో విద్యార్థులు

ఆళ్లగడ్డ: పాకిస్తాన్‌తో 1971లో జరిగిన యుద్ధంలో భారత్ విజయానికి గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నామని ప్రైవేటు పాఠశాలల సంఘం డివిజన్ అధ్యక్షుడు అమీర్‌బాషా అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద అమర జవాన్లకు నివాళులర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరులను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు.

గడ్డివామి దగ్ధం


మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

చాగలమర్రి: మండల కేంద్రంలోని శ్రీనివాసనగర్‌లో సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.50 వేల విలువ చేసే పశుగ్రాసం దగ్ధమైంది. వివరాలు.. స్థానిక చక్రపాణి సినిమా థియేటర్ సమీపంలో శ్రీనివాసనగర్‌కు చెందిన రైతు నరసింహారెడ్డి ఇంటి వద్ద గడ్డివామి వేసుకుని ఉన్నాడు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. స్థానికులు ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన ప్రమాద స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే గడ్డివామి పూర్తిగా కాలిపోయింది.

నేటి నుంచి రెండో విడత శిక్షణ

నంద్యాల(అర్బన్): గ్రామీణ సుస్థిరాభివృద్ధిపై మంగళవారం నుంచి రెండు రోజుల పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులకు రెండో విడతగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుగుణశ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండలస్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సర్వేయర్ అసిస్టెంట్లతో పాటు మహిళా పోలీసులు, వెటర్నరీ అసిస్టెంట్, డాక్టర్లు, ఐసీడీఎస్ అధికారులు హాజరు కావాలని సూచించారు.



చాబోలు వద్ద పొలాలపై కమ్ముకున్న మంచు దుప్పటి, సాంబవరం సమీపంలో ఉదయం ఎనిమిది గంటలైనప్పటికీ ధాన్యంపై పట్టలు కప్పి ఉంచిన దృశ్యం

గజ గజ

- వణికిస్తున్న చలి

గోస్పాడు: కొద్ది రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. తుపాను ప్రభావం తగ్గిన తరువాత చలి పులి పంజా విసురుతోంది. సాయంత్రం నాలుగు గంటల నుంచే శీతల గాలులు ప్రారంభమవుతున్నాయి. ఉదయం ఎనిమిది గంటలు దాటినా పొగమంచు వీడటం లేదు. భానుడిని కూడా మంచుదుప్పటి కప్పి ఉంచడంతో తొమ్మిది గంటల వరకు సూర్యుడి ప్రభావం కనిపించడం లేదు. పల్లెల్లో చలి నుంచి ఉపశమనం పొందేందుకు జనం చలిమంటలను వేసుకుంటున్నారు. ఇక హైవేపై వెళ్లే వాహనదారులు పొగమంచు కారణంగా రహదారి కనిపించక లైట్లు వేసుకొని వెళ్తున్నారు. ఇక చలికాలంలో వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, ఊపిరితిత్తుల వ్యాధుల బారిన పడిన వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చలి నుంచి రక్షణ నిచ్చే స్వెట్టర్లు, దుప్పట్లు కప్పుకోవాలని, చల్లటి గాలుల్లో తిరగరాదని చెబుతున్నారు. ఫ్రిజ్‌లోని ఆహారం, చల్లని నీళ్లు, ఐస్‌క్రీమ్ లాంటి వాటిని తీసుకోవద్దని, తాజా ఆకుకూరలు, పండ్లు తీసుకోవాలని, వేడి ఆహారాన్ని భుజించాలని నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే సరిపడ మంచినీటిని తాగాలంటున్నారు. విటమిన్ సీ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకుంటే వ్యాధినిరోధక శక్తి తగ్గకుండా ఉంటుందని తెలియజేస్తున్నారు.


గోస్పాడులో చలిమంటతో ఉపశమనం పొందుతున్న జనం

జాగ్రత్తలు తప్పనిసరి



చలికాలంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచుకురిసే, చల్లటి వాతావరణం ఉన్న సమయంలో బయట తిరగకూడదు. ఒక వేళ బయటకు వెళ్లాల్సి వస్తే తల, శరీరం కప్పి ఉండేలా ఉన్ని దుస్తులు ధరించాలి. ప్రతిఒక్కరూ ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి.శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా రోగులు వేకువజామున, రాత్రివేళల్లో బయటకు వెళ్లకపోవడమే మంచిది. వాకింగ్ చేయాల్సి వస్తే సూర్యోదయం తర్వాత చేయాలి. గతంలో కోవిడ్ బారినపడిన వారు అత్యంత జాగ్రత్తగా ఉండాలి. – వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ, నంద్యాల

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్):పట్టణ పురపాలక సంఘం పరిధిలోని సచివాలయ విభాగాల్లో ఆధార్ లేని ఆరు సంవత్సరాల పిల్లలకు ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకు వివిధ వార్డుల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనన ధ్రువపత్రం ఉండి ఆధార్ కార్డు లేని వారు ఆధార్ కార్డు డాక్యుమెంట్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు లేని వారు 34,660 మంది ఉండగా ఇప్పటి వరకు 2,219 మంది ఆధార్ కార్డు నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన 32,441 మంది ఆధార్ నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 17న పద్మావతినగర్, లలితానగర్, సాయిబాబానగర్, 18న సరస్వతినగర్, నూనెపల్లె, హరిజనవాడ, నర్స్ క్వార్టర్స్, 19న దేవనగర్, విశ్వనగర్, రెవెన్యూ క్వార్టర్స్ గోపాల్‌నగర్, 20న ఎస్‌బీఐ కాలనీ, మజీద్ సెంటర్, ఏకలవ్యనగర్ సచివాలయాల్లో క్యాంపులను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ: మండలంలో ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించనున్న మొబైల్ ఆధార్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ నెల 17,18వ తేదీల్లో అల్లూరు, 19, 20వ తేదీ మాయలూరు గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ సేవా కేంద్రాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

దొర్నిపాడు: ఆధార్ కార్డులో మార్పులు చేర్పుల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సావిత్రి సోమవారం తెలిపారు. ఈ నెల 17,18,19,20 తేదీల్లో దొర్నిపాడు, 26న బుర్రారెడ్డిపల్లె, 27, 28 తేదీల్లో చాకరాజువేముల గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. స్థానికులు తగిన ధృవపత్రాలు అందజేసి ఆధార్ కార్డులను సవరించుకోవాలని సూచించారు.

జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 19వ తేదీన విజయవాడలో జరిగే ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) 6వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునెప్ప కోరారు. సోమవారం స్థానిక కార్యాలయంలో కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పనిభద్రత కల్పించి పనికి తగ్గట్లు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ఏఐటీయూసీ డోన్ తాలూకా కార్యదర్శి అబ్బాస్, యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, సుశీలమ్మ పాల్గొన్నారు.

రాయలసీమ స్థాయి లెదర్ బాల్ క్రికెట్ టోర్నీ

జమ్మలమడుగు: క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాయలసీమ స్థాయి లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు వై.కె.కిరణ్, విజయ్‌కుమార్ తెలిపారు. సోమవారం జమ్మలమడుగులోని సీఎస్ఐ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి మాట్లాడారు. పోటీల్లో పాల్గొనదలచిన జట్లు రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈ నెల 20వ తేదీ లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21వ తేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. విజేతలకు వరుసగా.. రూ.70వేలు, రూ.40వేలు, రూ.15 వేలు అందజేస్తారన్నారు. వివరాలకు సెల్ 9666198552 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి


ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవానం పట్టణంలోని పద్మావతినగర్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు మాట్లాడుతూ జీవోనెం.77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మహానంది, ఉదయ్, సహాయ కార్యదర్శులు ఎర్రిస్వామి, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సంతోష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు..

సీఎంఆర్ షాపింగ్ మాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు రాజునాయుడు, రామచంద్రుడులు పేర్కొన్నారు. నిత్యం రద్దీగా తిరిగే ప్రాంతంలో అంత పెద్ద మాల్‌కు ఎలా అనుమతులు ఇస్తారంటూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నేడు రెవెన్యూ గ్రామ సభ

ఉయ్యాలవాడ: మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో మంగళవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న గ్రామసభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సనాతన ధర్మంతో మోక్షమార్గం


హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): సనాతన ధర్మాన్ని కాపాడుతూ, పాటిస్తూ ఉంటే వారు మోక్ష మార్గానికి వెళ్తారని తిరుమల తిరుపతి దేవస్థానం వ్యాఖ్యాత డీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. సోమవారం ధనుర్మాసం ప్రారంభం కావడంతో శ్రీభగవత్ సేవా సమాజ్, తిరుమల తిరుపతి దేవస్థానం ఆల్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు నంది రైతు సమాఖ్య ఆధ్వర్యంలో తిరుప్పావై దివ్య ప్రవచనాలను భక్తులకు వినిపించారు. ఆయన మాట్లాడుతూ ధనుర్మాస వ్రతం శరణాగతికి ప్రతీక అని, ఈ మాసంలో ఆండాల్‌దేవి బాహ్య అనుభవంతో అంతరనుభవంతో 30 రోజుల పాటు తన్మయత్వం , భక్తిపారవశ్యం చెందుతూ పాశురాలను గానం చేసిందన్నారు. ఈ పాశురాల గీతమాలిక తిరుప్పావైని వివరిస్తుందన్నారు. మొదటి రోజు తిరుప్పావై పాశురాన్ని భక్తులకు వివరించారు.

ఫేక్ కాల్స్‌తో మోసపోవద్దు

నంద్యాల(న్యూటౌన్): పట్టణ పరిధిలో వివిధ వాణిజ్య ప్రాంతాల్లో వ్యాపారాలు నిర్వహించే వారికి సెల్ నంబర్ 6281796199 నుంచి తాము నంద్యాల పురపాలక అధికారుల పేరుతో ఫేక్ కాల్స్ చేసి ట్రేడ్ లైసెన్స్ రుసుమును చెల్లించాలని చెబుతున్నారని, అలాంటి కాల్స్‌కు స్పందించి నగదు చెల్లించి మోసపోవద్దని నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి సోమవారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. మీరు పంపించాల్సిన మొత్తాన్ని ఈ నంబరు ద్వారా సెల్ : 90035 61007 ఫోన్‌పే చెల్లించమని చెబుతున్నారన్నారు. ఇలాంటి కాల్స్‌పై పోలీసు శాఖకు కూడా ఫిర్యాదు చేశామన్నారు. ట్రేడ్ లైసెన్స్‌లను శానిటరీ, ఎన్విరాల్‌మెంట్ సెక్రటరీ వారి ద్వారా రెన్యూవల్, కొత్త ట్రేడ్ లైసెన్స్‌లను పురపాలక సంఘంలో పొందాలని సూచించారు. ఫోన్‌పేలు, అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్ వస్తే మురళీధర్ సెల్: 98499 06654, లక్ష్మినారాయణ సెల్ : 98499 07458, శివప్రసాదరెడ్డి సెల్: 98499 08002, పి.లక్ష్మినారాయణ సెల్: 77027 76049 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఘనంగా ఐక్య దీపారాధన


సందేశమిస్తున్న గురువులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఆల్ సెయింట్ చర్చ్ సండే స్కూల్ ఆవరణలో సోమవారం సాయంత్రం బైబిల్ సొసైటీ ఆఫ్ ఇండియా నంద్యాల బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా ఐక్య దీపారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హోలీక్రాస్ కెథడ్రల్ పాస్టరేట్-1 డీనరీ చైర్మన్ కొత్తమాసి జోసెఫ్ పాల్గొని క్రైస్తవులకు ఐక్యదీపారాధన గురించి వివరించారు. దేవుడు లోకాన్ని ఎంతో ప్రేమించెను, ప్రపంచమంతటా వెలుగు ప్రకాశించెనని వివరించారు. అనంతరం హాజరైన వారందరికీ కొవ్వొత్తులు అందజేసి బైబిల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వేదనబాబు, పీజీఈ కిరణ్‌కుమార్ సందేశమిచ్చారు. కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక కీర్తనలు పాడారు. పాల్గొన్న క్రైస్తవులందరికీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో తెలుగు బాప్టిస్ట్ రక్షణాలయం గురువులు డాక్టర్ సీహెచ్ విజయ్‌భాస్కర్, అగస్టీన్, వినోలియా, ప్రసన్నకుమారి, పురుషోత్తం, ట్రెజరర్ ప్రసాద్ పాల్గొన్నారు.

సోలార్ ప్లాంటుకు భూమి పూజ

ఉయ్యాలవాడ: మండలంలోని గోవిందపల్లె గ్రామ సమీపంలో ఎస్ఏఈఎల్ కంపెనీ ఆధ్వర్యంలో రూ. 400 కోట్ల నిధులతో నిర్మించనున్న సోలార్ ప్లాంటు నిర్మాణానికి ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్ఏఈఎల్ కంపెనీ 10 చోట్ల సోలార్ ప్లాంట్ల నిర్మాణం చేపడుతోందని తెలిపారు. గోవిందపల్లె సోలార్ ప్లాంటు నిర్మాణం పూర్తయితే 300 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయన్నారు. అనంతరం రూపనగుడి చెరువును పరిశీలించి పంట కాల్వల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే చెరువులో నుంచి నీరు బయటకు వెళ్లకుండా మైనర్ ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో కట్టలను బలపరుస్తామన్నారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఏపీఓ రవిప్రకాష్ పాల్గొన్నారు.

రైతన్నకు కలుపు కష్టాలు


పప్పు శనగలో కలుపు తీస్తున్న కూలీలు

ఉయ్యాలవాడ: ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో సాగు చేసిన మిరప, పప్పుశనగ పంటల్లో కలుపు పెరిగిపోయాయి. దీంతో కలుపును తొలగించేందుకు అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో 1100 ఎకరాల్లో మిరప, మినుము- 480, సోయాబీన్ 180, పత్తి 1400 ఎకరాల్లో సాగయ్యాయి. అలాగే రబీ సీజన్‌లో 32,250 ఎకరాల్లో పప్పుశనగ పంట సాగు చేశారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. పంటకు వేరు కుళ్లు తెగులు సోకి దెబ్బతినడంతో రైతులు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినా మొక్క ఎదుగుదల లేదని ఆందోళన చెందుతున్నారు. ఇటీవల వరుసగా వచ్చిన తుపాన్ల ప్రభావంతో అధిక వర్షాలు కురిశాయి. దీంతో భూమిలో తేమ శాతం పెరిగి కలుపు మొక్కలు ఎక్కువయ్యాయి. కలుపు తొలగించేందుకు కూలీలకు డిమాండ్ పెరిగింది. రైతన్నకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఒక్కో కూలీకి రూ. 350 నుంచి రూ. 400 వరకు చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



విశేష అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు, శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో సంజీవనగర్ రామాలయం, బైటిపేట కోదండ రామాలయం, గుడిపాటిగడ్డ లక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవస్థానం, శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల్లో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వార్లకు ఉదయాన్నే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు, స్నపన తిరుమంజన సేవ కార్యక్రమాలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. సంజీవనగర్ రామాలయంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామికి, శ్రీదేవి, భూదేమి సమేత వెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలతో అలంకరించి మహామంగళ హారతులు ఇచ్చారు. భగవత్ సేవా సమాజ్ సభ్యులు సూరయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ బహిరంగ సభ


కేపీ తండాలో ఉపాధి హామీ పనుల నివేదికను వెల్లడిస్తున్న డీఆర్పీ

చాగలమర్రి: మండలంలోని కదిరిపురం తండాలో వాయిదా పడిన గ్రామ సభను అధికారులు ఎట్టకేలకు సోమవారం నిర్వహించారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ 2023-24 ఏడాదిలో నిర్వహించిన పనులకు వెచ్చించిన మొత్తంపై 4 రోజుల పాటు సామాజిక తనిఖీ సిబ్బంది గ్రామంలో ఇంటింటికి వెళ్లి తనిఖీ చేశారు. తనిఖీలో ఉపాధిహామీ పనులకు వెళ్లిన కూలీలకు సంబంధించి వారు పని చేసిన దినాలకు వారి ఖాతాల్లో కూలీ డబ్బులు జమ చేసినట్లు రికార్డులో నమోదైంది. అయితే టీడీపీకి చెందిన కొందరు ఉద్దేశపూర్వకంగా పనికి వెళ్లిన కూలీలు గ్రామంలో లేరని, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్నారని వారి కుటుంబ సభ్యులతో ఫిర్యాదు చేయిస్తున్నారని.. ప్రతి ఫిర్యాదులో 24 మంది సంతకాలు పెట్టి ఇచ్చారని ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.వెంకటేశ్‌నాయక్ ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్లను ఉద్యోగంలో నుంచి తొలగించడానికి ఇలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓం శివానాయక్ అనే వ్యక్తి ఉపాధిహామీ పనికి వచ్చి పాముకాటుకు గురైన విషయం ఏపీఓకు, సంబంధిత అధికారులందరికీ తెలుసని, ఆ వ్యక్తి పనికి రాకుండా కూలి అతని ఖాతాలో జమా చేశారని ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందని సర్పంచ్ శ్రీలక్ష్మీబాయి అన్నారు. ఎస్ఆర్పీ మురాద్, డీఆర్పీ నాగేశ్వరరావు, ఏపీఓ నిర్మలాదేవి, స్వచ్ఛ భారత్ కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలి



ప్రతిభ చాటిన విద్యార్థులతో డీఈఓ జనార్దన్ రెడ్డి, ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): జంప్‌రోప్ జాతీయ స్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రానికి, నంద్యాలకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని డీఈఓ జనార్దన్ రెడ్డి ఆకాంక్షించారు. ఇటీవల అనంతపురం జిల్లా కదిరి తాలూకాలో ఓడీ చెరువు గ్రామంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన శాంతినికేతన్ విద్యాసంస్థల క్రీడాకారుల జట్టును డీఈఓ సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. కాగా జాతీయస్థాయి పోటీలు జైపూర్‌లో జరుగుతాయని విద్యాసంస్థల చైర్మన్ సుధాకర్ తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

శిరివెళ్ల: జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీలకు విద్యార్థులు ఎంపికైనట్లు విమలా పాఠశాల ప్రిన్సిపాల్ అన్నగ్రేస్ తెలిపారు. ఈ నెల 14, 15వ తేదీల్లో మదనపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారన్నారు. త్వరలో రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో విద్యార్థులు గాలి జనని హర్షిత, నీషాబా, సమీరా, అజరన్, సాయి సాత్విక్, శాలిని, శృతిక, శివ సంతోష్, సుమంత్, రామ్‌లను పాఠశాల మేనేజర్ ప్లవరి, టీచర్లు అభినందించారు.

బాల్యం నుంచే సామాజిక స్పృహ ఉండాలి


మాట్లాడుతున్న ఇండియన్ సొసైటీ కో-ఆర్డినేటర్

శిరివెళ్ల: బాల్యం నుంచే పిల్లలు సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఇండియన్ సొసైటీ ఆర్గాన్ డొనేషన్ కో-ఆర్డినేటర్ ఆనందగురూజీ అన్నారు. సోమవారం మోడల్ స్కూల్‌లో అవయవదానంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రక్తదానం, నేత్రదానం, అవయవ దానం చేయడం సామాజిక సేవేనన్నారు. మనిషి మరణించిన తరువాత అవయవదానం చేయడం ఇతరులకు మేలు చేయడమేనన్నారు. దేశంలో లక్షలాది మంది కార్నియా లోపంతో అంధులుగా మిగిలిపోతున్నారన్నారు. నేత్రదానం చేస్తే వారికి చూపు వస్తుందన్నారు. అవయవదానాలపై ప్రతి పాఠశాల, కళాశాలలో రెడ్ క్రాస్ క్లబ్బులను ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఇష్రత్‌బేగం, ఇండియన్ సొసైటీ జిల్లా చైర్మన్ దస్తగిరి, నేత్రదానం కన్వీనర్ రిటైర్డ్ తహసీల్దార్ జనార్దన్ శ్రేష్ఠి, స్థానిక సభ్యులు హరికృష్ణ, రెడ్‌క్రాస్ డీఎఫ్ఓ అబ్దుల్ సమి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

చాగలమర్రి: మండలంలోని పెద్దబోధనం గ్రామ సమీపంలో ఉన్న కాశీరెడ్డి నాయన ఆశ్రమం వద్ద ఈ నెల 15వ తేదీ రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్నూలు జిల్లా దేవరకొండ గ్రామానికి చెందిన వడ్డే కొలుట్లయ్య(74) మృతి చెందినట్లు చాగలమర్రి ఎస్ఐ రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 14వ తేదీ అదే గ్రామానికి చెందిన కొందరు స్నేహితులతో కలిసి వైఎస్సార్ జిల్లా కాశీరెడ్డి నాయన ఆశ్రమం వద్ద జరుగుతున్న జ్యోతుల కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తుండగా పెద్దబోధనం కాశీరెడ్డి నాయన ఆశ్రమం వద్ద భోజనం చేసి రోడ్డు దాటే క్రమంలో ఆళ్లగడ్డ వైపు నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడి కుమారుడు మునుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న సురేంద్రబాబు

శిరివెళ్ల: విజయవాడలో జనవరి 5వ తేదీ జరగనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ ఉమ్మడి జిల్లా ప్రచారక్ సురేంద్రబాబు అన్నారు. సోమవారం యర్రగుంట్ల రామాలయంలో శంఖారావం విజయవంతంపై సమావేశం జరిగింది. మనది సనాతన ధర్మ దేశమన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవాలయాల ఆదాయాన్ని కేవలం ధర్మ ప్రచారాలకు, సేవలకు మాత్రమే ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ నాగిరెడ్డి, సహ సంయోజక్ రాజశేఖర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

కలప.. డిపోకు చేరేదెన్నడో?


పట్టుబడిన కలప దుంగలు


అహోబిలంలో మొండి గోడల్లో ఉన్న వెదురు కర్రలు

రుద్రవరం: అహోబిలంలో మొండి గోడల గదిలో నిల్వ ఉన్న టేకు దుంగలు, వెదురు కర్రలు మూడు నెలలు దాటినా రుద్రవరం కలప డిపోకు చేరలేదు. దిగువ-ఎగువ అహోబిలం మధ్య రోడ్డుకు ఇరువైపులా టేకు చెట్లు ఉన్నాయి. ఏపుగా పెరిగి ఉన్న చెట్లు గాలివానకు నేలకు వాలి ఉన్నాయి. అలాంటి వాటిని గుర్తు తెలియని వ్యక్తులు గుట్టుచప్పుడు కాకుండా నరికి తరలించుకెళ్తున్నారు. మూడు నెలల క్రితం అహోబిలం సెక్షన్ అధికారులు దాడులు చేయగా నిందితులు దుంగలను వదిలేసి పారిపోయారు. ఆ దాడిలో దాదాపు 10 టేకు జాతికి చెందిన దుంగలతో పాటు చెట్టు మొదలు(అడుగు భాగం)ను స్వాధీనం చేసుకుని అహోబిలంలోని అటవీ ప్రాంగణలో ఉంచారు. ఆ తర్వాత కొద్ది రోజులకు అక్రమంగా తరలిస్తున్న వెదురు కర్రలను స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలలు దాటినా వాటిని రుద్రవరం కలప డిపోకు తరలించలేదు. సాధారణంగా రుద్రవరం రేంజిలో ఎక్కడైనా కలప దుంగలు పట్టుబడితే వెంటనే కేసు నమోదు చేసి రుద్రవరం కలప డిపోకు తరలించాల్సి ఉంది. ఆ కలపకు నెలలో ఒకసారి వేలం నిర్వహించి వచ్చిన సొమ్మును ప్రభుత్వ బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. అయితే అహోబిలంలో ఇందుకు విరుద్ధంగా సాగుతోంది. దీనిపై ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీపతినాయుడును వివరణ కోరగా విచారణ చేసి దుంగలను కలప డిపోకు తరలించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.